క్లుప్తంగా

భూరీసర్వే పరిశీలన


భూ సర్వేపనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

శృంగవరపుకోట: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష' పథకంలో భాగంగా మండలంలోని ధర్మవ రం గ్రామంలో చేపడుతున్న భూరీసర్వేను విజయనగరం ఆర్డీఓ సూర్యకళ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో ఎంత విస్తీర్ణంలో సర్వే పూర్తయిందో సిబ్బందిని అడిగితెలుసుకుని పలు సూచనలు చేశారు. భూ రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో రైతులకు ముందుగా సమాచారం అందించి వారి సమక్షంలో పక్కాగా సర్వే చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు ఉన్నారు.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

చీపురుపల్లి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ కె.వి.ఎన్. రాజేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి మండలం లోని ఆర్డీవలస, పుర్రేయవలస, మెరకముడిదాం మండలం లోని సాతాంవలస-2, పులిగుమ్మి, గరివిడి మండలంలోని దేవాడ-1, కొండలావేరు అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్న ఈ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీలోగా చీపురుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా కాని, పోస్టల్ ద్వారా కాని దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పదోతరగతి ఉత్తీర్ణులై, స్థానిక వివాహితులైన 21 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు.

క్రీడా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాల విద్యార్థిని సీహెచ్.విశాలాక్షి కాంస్య పతకం సాధించింది. జనవరి 28 నుంచి 30 వరకు భీమవరంలో ఈ పోటీలు నిర్వహించారు. అలాగే ఇదే కళాశాలకు చెందిన విద్యార్థినులు జనవరి 30న విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-19 బాలికల కబడ్డీ, ఖోఖో పోటీల్లో వి.లావణ్య,ఎం.రోహిణి సత్తా చాటి, రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, పీడీ శ్రీనివాసరావు అభినందించారు.


నాడు-నేడు పనుల పరిశీలన

వేపాడ: మండలంలోని వేపాడ, సోంపురం ఉన్నత పాఠశాలల్లో నాడు-నేడు ఫేజ్-2లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను సర్వశిక్షఅభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్, నియోజకవర్గ ఇన్‌చార్జి అప్పలస్వామి నాయుడు మంగళవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరగా పూర్తిచేసేలా చూడాలని హెచ్‌ఎంలు వల్లీ, బాలభాస్కర్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు, తదితర అంశాలపై ఆరా తీశారు.

నేడు గృహసారథుల సమావేశం

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీకి సంబంధించిన మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల విస్తృతస్థాయి సమావేశం బుధవారం నిర్వహించనున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దత్తిరాజేరులోని కస్తుర్బా గాంధీ విద్యాలయం (కేజీబీవీ) సమీపంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అన్ని గ్రామాల నుంచి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు హాజరు కావాలని కోరారు. అలాగే పోరలి గ్రామంలో రూ.13 లక్షలతో గొడౌన్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు.

6న అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె


సీడీపీఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొత్తవలస: అంగన్‌వాడీ కార్యాకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన ఒక్క రోజు సమ్మెతో పాటు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.లక్ష్మి, ఎస్.అనసూయ తెలిపారు. ఈ మేరకు మండంలోని కుమ్మరిబంజిరి వద్ద గల సీడీపీఓ కార్యాలయ సిబ్బందికి అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసును మంగళవారం అందజేశారు. ఫేస్ యాప్ హాజరు నమోదు విధానం రద్దుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అవినీతి రహిత ఆదర్శ పాలన

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


సభలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతి రహిత, ఆదర్శవంతమైన సంక్షేమపాలనను ప్రజలకు అందిస్తోందని, ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే ప్రజలకు అందు తున్నాయని, ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గరివిడి మండలంలోని బొండప ల్లి సచివాలయం పరిధిలో గొట్నంది గ్రామంలో మంగళవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. అంతకు ముందు నిర్వహించిన గ్రామసభలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. పార్టీలకు అతీతంగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, వివిధ సంక్షేమ పథకాల ద్వారా గొట్నంది గ్రామస్తుల ఖాతాల్లో ఈ మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.4 కోట్లు జమచేశామని, పలువురికి ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి స్థానిక రైతుభరోసా కేంద్రం ద్వారా 169 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, రూ.1.45 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. విద్య, వైద్యరంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేసి, సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టామని, 8వ తరగతి విద్యార్థులకు ఇటీవల బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందించామని గుర్తు చేశారు. వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు గ్రామాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. పేదలకు మంచి జరుగుతుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని, ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఎల్లో మీడియా ద్వారా చంద్రబాబునాయుడు అబద్ధాలు, దుష్ప్రచారాలు చేయిస్తున్నారని, వారి మాయమాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎంపీడీఓ జి.భాస్కరరావు, స్థానిక సర్పంచ్ లోపింటి రాంబాబు,ఎంపీటీసీ రాములప్పమ్మ, ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు,వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములునాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణం నాయుడు, పీఏసీఎస్‌ల అధ్యక్షులు లెంక శ్రీరాములు,ఎడ్ల అప్పారావు, డీసీసీబీ డైరెక్టర్ కాంతారావు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం


ధర్మవరంలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, వలంటీర్లు, సచివాల య ఉద్యోగులతో కలిసి మంగళవారం సాయంత్రం' గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎస్సీ కాలనీలో బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వారికి ఈ మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పథకాల ద్వారా కలిగిని లబ్ధిని వివరించారు. స్థానికులు కొందరు ప్రస్తావించిన చిన్నపాటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎ మ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎంపీటీసీ డో ల కనకమహాలక్ష్మి, నాయకులు అల్లు మహాలక్ష్మి నాయుడు, ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబా బు, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, నాయకులు మోపాడ కోటి, కె.అప్పయ్య, రంది అనంత్, చింతల నారాయణమూర్తి పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం


ఇప్పలవలసలో పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మెరకముడిదాం: అర్హతే ప్రామాణికంగా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తూ, ప్రజాసంక్షేమ పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని ఇప్పలవలస గ్రామంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ రమేష్‌పటా న్నాయిక్, ఎంపీటీసీ సాంబ, స్థానిక నాయకుడు ప్రసాద్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు


మెరకముడిదాం: విద్యుత్‌ట్రాన్స్‌పార్మర్‌ను ప్రారంభిస్తున్న ప్రసాద్, అధికారులు

గుర్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న వెంటనే గృహ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని విద్యుత్ శాఖ డీఈ త్రినాథరావు తెలిపారు. మండలంలోని చింతపల్లిపేట జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జమ్ము శ్రీదేవి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం

మెరకముడిదాం: మండల కేంద్రంలోని రెండు జగనన్న కాలనీల్లో రూ. 50 లక్షలు వెచ్చించి ఆర్‌ఈసీఎస్ అధికారులు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, విద్యుత్‌లైన్లు వేశారు. ఆ విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్లను వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఆర్‌ఈసీఎస్ అధికారులు మంగళవారం ప్రారంభించారు. కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు,రోడ్లు సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కాలనీల్లో ప్రతీ ఇంటికి ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్‌ఈసీఎస్ డీఈ త్రినాథరావు, ఏఈ శ్రీనివాసరావు, సర్పంచ్ బి.కన్నమ్మ పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ


ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక, అధికారులు

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలోని 17 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం సమకూర్చిన ఉపకరణాలను, ఎంఈఓ విమలమ్మ, ఎంపీడీఓ కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక మంగళవారం పంపిణీ చేశారు. నలుగురికి సీపీ చైర్‌లు, ఒకరికి వీల్ చైర్, అయిదుగురికి రొలేటర్లు, ఏడుగురికి వినికిడి పరికరాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యతో పాటు ఫిజియో, స్పీచ్ థెరపీ సేవలను ప్రభుత్వం అందిస్తోందని, ఈ సేవలను పిల్లలు వినియోగించుకునేలా వారి తల్లిదండ్రులు చూడాలని అన్నారు. ఐఈఆర్‌టీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీఆర్పీ రెడ్డి

గజపతినగరం: స్థానిక ఏఎస్ఎన్ఎం పాఠశాలలో సీఆర్పీ రెడ్డి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న తీరు, విద్యార్థుల వర్క్‌బుక్‌లు, వారి హాజరు, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

సమన్వయంతో అభివృద్ధి సాధిద్దాం

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి అతిథిగా ఆయన హాజరయ్యారు. సమావేశంలో ముందుగా అధికారులు తమ శాఖ ల వారీగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో కన్నా ఈ సంవత్సరం ధాన్యం అధిక మొత్తంలో కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో బిల్లులు జమచేసిందని చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇంకా రైతుల వద్ద ఉన్న ధాన్యం నిల్వల వివ రాలను వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది సేకరిస్తున్నారని, వాటిని కూడా కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామాల్లో ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని, పనులు పూర్తయితే గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. భూములకు సంబంధించి పురోనాలు కలిగి ఉన్న వారు త్వరలో గ్రామసచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గడసాం సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ వలంటీర్లకు జగనన్న చేదోడు పథకానికి సంబంధించిన సమాచారం ఇవ్వకపోవడం వల్ల చాలామంది పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోయారని గడసాం సర్పంచ్ నేతేటి దీపిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని, విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవన్నారు. షికారుగంజి గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనంలో నడుస్తున్నాయని, భవనాలు నిర్మించాలని ఆ గ్రామ సర్పంచ్ సుంకరి వెంకటరావు కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యసిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన పాటించడం లేదని ఎంపీపీతో పాటు, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు వైద్యాధికారి ఆనంద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ రాతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, ఈఓపీఆర్డీ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశిమాంబ జాతర


జాతరలో భక్తుల సందడి


ఎడ్ల పరుగు పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: వావిలపాడులో రెండురోజుల పాటు నిర్వహించిన గ్రామదేవత పరదేశిమాంబ జాతర మంగళవారం సాయంత్రం ఎడ్ల పరుగు ప్రద ర్శన పోటీలతో ముగిసింది. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్ట పక్క గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో విజయనగరం,అనకాపల్లి జిల్లాలకు చెందిన 18 జతల ఎద్దులు పాల్గొన్నాయి. వరుసుగా అయిదు స్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానులకు డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు, మండల వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు సన్యాసినాయుడు, గ్రామపెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


పెదవేమలిలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


తామరపల్లిలో కంటి సమస్యలు ఉన్నవారికి మందులు అందజేస్తున్న సర్పంచ్ ముత్యాలనాయుడు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి, కొండతామరపల్లి గ్రామాల్లో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. పెదవేమలిలో హీలింగ్ హ్యూమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరానికి వచ్చిన ప్రజలకు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి బీపీ, ఈసీజీ, ఇతర సాధార వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసు కోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఎంపీటీసీ పాటువురెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు, ఇమ్మానుయేలు సహాయ సహకారాలు అందించారు. తామరపల్లిలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్రవైద్య శిబిరంలో సిబ్బంది పలువురికి నేత్రపరీక్షలు చేసి, కళ్లద్దాలు, శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. సర్పంచ్ కోడెల ముత్యాలనాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గజపతినగరంతో పాటు అన్ని గ్రామాలు, జిన్నాం మినీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఈఈ కృష్ణ మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే బొండపల్లి మండల కేంద్రంతోపాటు బొండపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు, కోమటిపల్లి, ఇద్దనవలస సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు సైతం విద్యుత్ సరఫరాను మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

3న మండల సర్వసభ్య సమావేశం

బొండపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 3వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏ.వేదవతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్ల చలం నాయుడు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

తెట్టంగిలో పారిశుద్ధ్య పనులు


చెత్తను ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న కార్మికులు

గుర్ల: మండలంలోని తెట్టంగిలో సర్పంచ్ జమ్ము పార్వతి ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికు లు గ్రామంలోని అన్ని వీధుల్లోని కాలువల్లో పూడికలను , బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తొలగించి, వెంటనే చెత్తనుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. పనులను ఈఓపీఆర్‌డీ గాయత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ముస్వామినాయుడు పరిశీలించారు.


రైతులు ఆందోళన చెందవద్దు

బొండపల్లి: ఈ-క్రాప్ చేయించుకున్న ప్రతీ రైతు నుంచి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని ఎంపీపీ చల్ల చలం నాయుడు సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 75 శాతం ధాన్యం సేకరణ పూర్తి చేసామని తెలిపారు. మిగిలిన 5 వేల మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గాను ప్రసుత్తం కల్లాల్లో ఉన్న 2,250 మెట్రిక్ టన్నుల ధాన్యం,రైతుల వివరాలను జియోట్యాగింగ్ పూర్తి చేశామని చెప్పారు. ధాన్యం సేకరించే పనిలో వ్యవసాయాధికారులు నిమగ్నమయ్యారని వివరించారు.

న్యాయం చేయండి

శృంగవరపుకోట: తమ వృత్తిపై వేటు వేసేలా కొంత మంది చేస్తున్న అన్యాయాన్ని నిలువరించి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్.కోటలోని రజక వృత్తిదారులు స్థానిక రెవిన్యూ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. రజక సంఘం అధ్యక్షుడు ఆర్.చిట్టిబాబు మాట్లాడుతూ స్థానిక పుణ్యగిరి గెడ్డలో రజకులు బల్లలు, ఊటబావులు ఏర్పాటు చేసుకుని బట్టలు ఉతుకుతూ కుటుంబ పోషణ చేసుకుంటున్నారన్నారు. ఇప్పుడు కొందరు వ్యక్తులు గెడ్డ స్థలం తమది అంటూ ఆక్రమించి బల్లలు తీసేసి, ఊటబావులు కూల్చేసి రజకుల ఉపాధి తీస్తున్నారన్నారు. అడిగితే దౌర్జన్యం చేయడంతో పాటు ఆడవారిని బూతులు తిడుతూ ఇబ్బందులు పెడుతున్నారని, తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. డిజిటల్ సర్వే చేయించి గెడ్డ హద్దులు నిర్ధారిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రజకులు నిరసన విరమించారు.

సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి


తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చీపురుపల్లి: ఆంధ్రా యూనివర్శిటీ పరిధిలో డిగ్రీ అయిదో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు.ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష ఆధ్వర్యంలో విద్యార్థులు తహసీల్దార్ ఎం.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు డిసెంబర్ వరకు ఇంటర్న్‌షిప్ పేరుతో, తర్వాత పండగ సెలవులు కారణంగా తరగతులకు దూరంగా ఉన్నారని చెప్పారు. ఫిబ్రవరి 28 వరకు తరగతులు నిర్వహించాలని ఉన్నత విద్యా కమిషన్ సూచించినప్పటికీ ఆంధ్రా యూనివర్శిటీ పరీక్షలకు సిద్ధమవుతోందని, చాలా డిగ్రీ కళాశాలల్లో సిలబస్ పూర్తవ్వనప్పటికీ పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. యూనివర్సిటీ అధికారులు మరోసారి పునరాలోచన చేసి పరీక్షలు వాయిదా వేయాలని కోరారు.

కోడి పందాల శిబిరంపై దాడి

లక్కవరపుకోట: మండలంలోని నిడిగట్టు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఎల్.కోట ఎస్ఐ ఎస్.ముకుందరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఆరుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.10,200 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

బొండపల్లి-2 సచివాలయ కార్యదర్శిగా నారాయణమూర్తిరాజు

బొండపల్లి: బొండపల్లి సచివాలయం-2 కార్యదర్శిగా జంపాన నారాయణమూర్తిరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఏ.వేదవతికి ఆయన తన నియామక పత్రాలను అందజేశారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆయనకి ఎంపీడీఓ సూచించారు.

ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇంటి, వ్యాపార సముదాయాలకు సంబంధించిన పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ పట్నాయక్, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో మంగళవారం వారు సమావేశం నిర్వహించారు. సచివాలయాల్లో ఈ-సర్వీసులు పెంచాలని, ఆధార్ సెంటర్ల నిర్వహణ, ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి ప్రజల వివరాల నమోదు తదితర అంశాలపై ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ పలు సూచనలు చేశారు.సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు.

తృటిలో తప్పిన ప్రమాదం


చెరువు వద్ద పైపులైన్‌ను ఢీకొని నిలిచిన ట్రాక్టర్


శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామ సమీపంలో కోమటి చెరువు వద్ద మంగళవారం తృటిలో ప్రమాదం తప్పింది. చామలాపల్లి క్వారీ నుంచి ఇంటి నిర్మాణానికి సంబంధించిన కాంక్రీట్ పిక్కను ట్రాక్టర్‌తో గంట్యాడకు తరలిస్తున్న సమయంలో చెరువు మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పింది. అక్కడే తాగునీటి పైపులైను ఉండడంతో ట్రాక్టర్ దానిని ఢీకొట్టి నిలిచిపోయింది. ప్రమాదంలో తాగునీటి పైపు లైన్ ధ్వంసమైంది.

వైభవంగా రామాలయ పునఃప్రతిష్ఠోత్సవాలు


పూజా కార్యక్రమాల్లో నాయకులతో కలిసి ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు రెండో రోజు మంగళవారం వైభవంగా సాగాయి. వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య స్థానిక సర్పంచ్ బేత శ్రీదేవి, ఎంపీటీసీ బాలి జయమ్మ, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ ఆర్.రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.మూడో రోజు బుధవారం విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాల్య వివాహాలు నేరం


మాట్లాడుతున్న ఎస్బీసీసీ జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ

జామి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ (ఎస్బీసీసీ) జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన, రక్తహీనత, లింగ వివక్ష, జంక్ ఫుడ్ తినడం వల్ల కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల్లో మన జిల్లా అయిదు స్థానంలో ఉందని, దాన్ని జీరో స్థాయికి తీసుకురావడానికి అంతా కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 112 లేదా 1098కు సమచారం అందించాలని సూచించారు.హెచ్‌ఎం అబ్దుల్ రెహ్మాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.